'ప్రైవేటు'లో ఫీజుల మోత

- కార్పొరేట్ పాఠశాలల్లో నిలువు దోపిడీ
- పుస్తకాలు, యూనిఫాం పేరిట భారీగా వసూలు
- ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సొంత సిలబస్ అమలు
- విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం
- సెలవుల్లోనే వ్యాపారం మొదలెట్టిన పాఠశాలలు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు





బద్వేలు : బద్వేలు పట్టణం విస్తరిస్తోంది. జనాభా పెరుగుతోంది. అందుకు తగ్గట్టు ప్రభుత్వ పాఠశాలలు లేవు. అందుకే ఏడాదికి ఒకటి, రెండు, మూడు ప్రైవేట్ పాఠశాలలు పుట్టుకొస్తున్నాయి. వాటిని నియంత్రించాల్సిన విద్యా శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మనదేశంలో ప్రైవేట్ విద్యాసంస్థలు లాభాపేక్ష లేకుండా నడపాలని చట్టం ఉంది. మరో పక్క ప్రైవేట్ పాఠశాలలు లాభాల కోసమే పని చేస్తూ ఉండటం బహిరంగ రహస్యమే. ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని నియంత్రణ చేయడానికి ప్రతి జిల్లాకు జిల్లా విద్యా శాఖ ఉంది. కానీ కాసులు కురిపిస్తే కాని పనంటూ లేదనే విషయాన్ని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం బాగా వంటపట్టించుకుంది. అందుకే బద్వేలు పట్టణంతో పాటు నియోజకవర్గంలో వందకు పైగా ప్రైవేట్ పాఠశాలలు పురుడుపోసుకున్నాయి. ఒక వేళ ప్రైవేట్ పాఠశాలల దోపిడీని నియంత్రించేందుకు విద్యాశాఖాధికారులు ప్రయత్నిస్తే.. నాయకుల ద్వారా ఒత్తిడి తీసుకువస్తున్నారు.

సీట్లు పరిమితం అంటూ బోర్డులు పెట్టి..

విద్యాసంవత్సరం ప్రారంభానికి ఇంకా దాదాపు పది రోజుల సమయం ఉంది. కానీ బద్వేలు నియోజకవర్గంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులు తల్లిదండ్రులతో వ్యాపారం మొదలెట్టాయి. ఇప్పటికే నెల నుంచి అడ్మిషన్లు చేపడుతున్నాయి. సీట్లు పరిమితం అంటూ బోర్డులు పెట్టి ఆర్భాటపు ప్రకటనలతో విద్యార్థులను వారి తల్లిదండ్రులను బుట్టలో వేసుకుంటున్నారు. మరోవైపు తమ పాఠశాలలో పని చేసే సిబ్బందిని ఇంటింటి ప్రచారానికి వాడుకుంటూ అడ్మిషన్లు చేసుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు, క్రీడా మైదానాలు లేకపోయినా యాజమాన్యం ఫీజుల మోత మోగిస్తోంది. అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకూ వసూలు చేస్తున్నారు. దీనికితోడు ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్మార్టు ఫీజంటూ ఇలా రక రకాల ఫీజులు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం, టైయి, బెల్టు, షూలు కూడా తమ పాఠశాలలోనే కొనుగోలు చేయాలని నిబంధనలు పెడుతున్నారు. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకూ పాఠ్య పుస్తకాలకు రూ.6 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వ ఫీజుల నియంత్రణ ఇలా..

ప్రభుత్వ ఫీజుల నియంత్రణ ఇలా ఉంది. ఒకటి నుంచి మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.6 వేలు, మండల కేంద్రాల్లో ఉన్న పాఠశాలల్లో రూ.7,500, పట్టణాల్లో రూ.8,600, జిల్లా కేంద్రంలో రూ.10 వేల చొప్పున ఫీజులు నిర్ధారించారు. 4–5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9 వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12 వేలు, ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9 వేలు, మండల కేంద్రాల్లో రూ.9,500, పట్టణాల్లో రూ.11,100, పాఠశాల స్టార్ రేటింగ్ మేరకు ఈ ఫీజులు నిర్ణయించారు. కానీ ఎక్కడా ఈ నిబంధనలు అమలు కావడం లేదు. బద్వేలులో ఓ కార్పొరేట్ పాఠశాలలో అయితే పి.పి.1 కే (ఎల్.కే.జీ.) రూ.26,500లు, పి.పి.2 కు(యు.కే.జీ.) వసూలు చేస్తున్నారు. ఓనమాలు రాని వారికే వేలల్లో ఫీజులు చెల్లించాలంటే తల్లిదండ్రులు హడలిపోతున్నారు.

అమలు కాని నిబంధనలు

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో గతంలో ఓ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించేది. పాఠశాలలో మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాలు, పట్టణాల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించి స్కూళ్లకు ర్యాంకింగ్ ఇచ్చేవారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేసే ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో ప్రదర్శించాలి. కానీ ఈ నిబంధనలు ప్రైవేట్ పాఠశాలలు ఏమాత్రం పాటించడం లేదు. సిలబస్ విషయానికి వస్తే రాష్ట్ర ప్రభుత్వం ముద్రించే పుస్తకాలను బోధించాలి. కానీ కొన్ని పాఠశాలల్లో ఒక్కొక్క పబ్లికేషన్ పుస్తకాలను, ఐఐటీ ఒరియంటెడ్, ఇ టెక్నో పేర్లతో విక్రయిస్తూ వాటినే బోధిస్తున్నారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఇంటర్ స్థాయిలో ఉండే సిలబస్‌ను జోడించి సొంతంగా పుస్తకాలను విక్రయిస్తున్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలను విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని ప్రతి ఏడాది పాఠశాలల ప్రారంభ సమయంలో తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ విషయమై వైఎస్సార్ జిల్లా ఉప విద్యా శాఖాధికారి రాజగోపాల్ రెడ్డిని సాక్షి వివరణ కోరగా.. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం చేయాలన్నా అటువంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు పాఠశాలల యాజమాన్యం ముందుగానే కోర్టు ఉత్తర్వులు చూపిస్తోందని తెలిపారు. వ్యక్తిగతంగా తల్లిదండ్రులు ఫీజుల విషయమై ఫిర్యాదు చేస్తే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ఆలయంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న నల్లేరు విశ్వనాథరెడ్డి

బి.కోడూరు : మండలంలోని రాజుపాళెంలోని పల్నాడు అంకాలమ్మ తల్లి మహోత్సవం ఐదవ రోజు వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచే అమ్మవారికి మహిళలు, దంపతులు కలిసి అంకాలమ్మకు ఘనంగా పూజలు నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత నిర్వహించిన ఈ మహోత్సవ కార్యక్రమం మండలంలోని ప్రజలు తిలకించేందుకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బద్వేలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయ కర్త నల్లేరు విశ్వనాథరెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు దుగ్గిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్న సభ్యులు

పోరుమామిళ్ల : ప్రతి మానవుడు తాను చేసిన కర్మ ప్రతిఫలాన్ని తప్పక అనుభవిస్తాడని కర్మ యోగం విశిష్టత గురించి తెలియజేసేది త్రైత సిద్ధాంత భగవద్గీత మాత్రమేనని త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని టేకూరుపేట, చిన్న యరసాల, పెద్ద యరసాల, కప్పలపల్లె, బుచ్చంపల్లె గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు తిరుపతయ్య, రాజేశ్వరి, లక్ష్మి, కృష్ణారెడ్డి, శ్రీదేవి, బలరామయ్య, శ్రీనివాసులు, పద్మ, అంజలి పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకత పెంచాలి



విద్యార్థులకు బహుమతులిస్తున్న యూటీఎఫ్ నాయకుడు చెన్నయ్య

పోరుమామిళ్ల : నేటి పోటీ ప్రపంచంలో చదువు ప్రధానం అయిందని, కానీ పిల్లల్లో మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెరగాలంటే వారిని క్రీడలు, సాంస్కృతిక కళా రంగాల్లో ప్రతిభను నిరూపించుకునే విధంగా అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహించాలని యూటీఎఫ్ నాయకుడు చెన్నయ్య, లైబ్రేరియన్ ఆఫ్రిది సూచించారు. స్థానిక గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 28 నుంచి నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందచేశారు. ఈ శిబిరంలో విద్యార్థులకు కథలు, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జేవీవీ నాయకులు దాదా పీర్, ఖాశింవలి, అబ్దుల్ హుసేన్, కృష్ణారెడ్డి, పీర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట

బి.కోడూరు : మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో బుధవారం నుంచి సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నూతన కమిటీ సభ్యులు తెలిపారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నరాల రామారెడ్డికి ప్రముఖుల పరామర్శ



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అవధాని నరాల రామారెడ్డిని మంగళవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. నరాల రామారెడ్డి సతీమణి సరోజమ్మ ప్రమాదంలో గాయపడి ఆదివారం రాత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి, మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, రాచమల్లు కిరణ్ కుమార్‌రెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, వైవీ. రామమునిరెడ్డి, వైవీ.స్వరూప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి సాధు గోపాలకృష్ణ, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, డాక్టర్లు రవి చంద్రారెడ్డి, సురేష్ శ్రీనివాస్, చాడా చెన్నకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, త్యాగ రాజరెడ్డి, విజయశ్రీతోపాటు పలువురు న్యాయవాదులు, ప్రముఖులు మంగళవారం సరోజమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య శ్మశాన వాటికలో సరోజమ్మ భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చతుస్థానార్చన మూలమూర్తి హోమం, ఉత్సవబలి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన గరుడవాహనసేవలో శ్రీనివాసుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి రామలింగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, శ్రీధర్, మల్లేశ్వరి, సుభద్రమ్మ, జయరామిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న కళాకారులు

వక్ఫ్ ఆస్తుల ఆక్రమణపై కోర్టును ఆశ్రయిస్తాం

మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో వక్ఫ్ ఆస్తుల ఆక్రమించి స్థలాలు స్వాహా చేసిన వారిని కోర్టును ఆశ్రయిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ మోడంపల్లె మసీదుకు సంబంధించిన 73 సెంట్ల స్థలం అమ్మకానికి సంబంధించి లాయర్ దాదా పీర్‌పై గతంలో కేసు నమోదైందని తెలిపారు. అందులో ఆయన నిందితుడుగా ఉంటూ క్వాష్ పిటీషన్ వేసి కేసు కొట్టివేయించు కున్నారని, ఈ కేసు రీ ఓపెన్ చేయిస్తామని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ నాయకుడు ముక్తియార్ దౌర్జన్యం చేసి దొమ్మీ జరిపి అడ్డదిడ్డంగా అంజుమన్ అహలె ఇస్లాం కమిటీ ఎన్నిక నిర్వహించి కమిటీ అధ్యక్షుడయ్యారన్నారు. తాను ఇస్లాంపురం మసీదులో బైఠాయించానని, చట్ట ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి జిలాన్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించానన్నారు. రాజకీయాల్లో ఉన్న వారు అంజుమన్ కమిటీలో ఉండకూడదనే నిబంధన ఉందని, టీడీపీ నాయకుడు ముక్తియార్ ఎలా కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికవుతాడని ప్రశ్నించారు. ఎన్నిక జరిపితే గెలవలేననే భయంతో ముక్తియార్ దొంగదారిలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడయ్యాడన్నారు. మసీదులో సర్‌ఫర్‌గా ఉన్న ముక్తియార్ రాజీ నామా చేసి ఎలా పోటీ చేశాడన్నారు. పట్టణంలో 9 మంది ముస్లిం మైనారిటీ కౌన్సిలర్లు ఉన్నా ముక్తియార్ ఏనాడూ వారిని పట్టించుకోలేదన్నారు. సమావేశంలో గైబుసా, ఫారూక్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి



వాగ్దేవి హైస్కూల్ ప్రారంభిస్తున్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతూ వాగ్దేవి విద్యా సంస్థలు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నాయని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దశెట్టిపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన వాగ్దేవి హైస్కూల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పాఠశాల గదులు, ప్లే గ్రౌండ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాగ్దేవి విద్యా సంస్థలు గత 30 ఏళ్లుగా ప్రొద్దుటూరు, చుట్టుపక్కల ప్రాంతాల వారికి అత్యాధునిక పరికరాలతో విద్యాబోధన చేయడం అభినందనీయమన్నారు. వాగ్దేవి విద్యా సంస్థల చైర్మన్ జి.హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ వాగ్దేవి హైస్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్‌తో విలువలతో కూడిన విద్యను అందివ్వడం తమ ప్రథమ కర్తవ్యం అన్నారు. కరస్పాండెంట్ జి.చంద్రావతి మాట్లాడుతూ పెద్ద నగరాల్లో అందించే విద్యను అతి తక్కువ ఫీజుతో వాగ్దేవి హైస్కూల్‌లో అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, ఎం.అరుణ, సిద్దేశ్వరరావు పాల్గొన్నారు.

గోవులను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రొద్దుటూరు : గోవులను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని త్రీటౌన్ ఏఎస్ఐ సుబ్బన్న తెలిపారు. స్థానిక కాన్పుల ఆస్పత్రి వద్ద గో మాతల సేవా కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బన్న, కానిస్టేబుల్ భాస్కర్ పాల్గొని గోవులకు ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బన్న మాట్లాడుతూ ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి పడేయడంతో వాటిని ఆవులు తిని మృత్యువాతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కవర్లను వాడకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శివకుమార్ యాదవ్, కేరోజి, వంకధార నరేంద్ర రావు, మోరగుడి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సుహృద్భావంతో పండుగలు జరుపుకోవాలి

మైదుకూరు : పట్టణంలో అన్ని మతాల వారు సుహృద్భావంతో తమ పండుగలను జరుపుకోవాలని అర్బన్ సీఐ కేవీ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ మాట్లాడుతూ రానున్న బక్రీద్ పండుగను ముస్లింలు సామరస్యంతో జరుపుకోవాలని సూచించారు. ఎవ్వరూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టించవద్దని కోరారు. ఏదైనా సమస్యలు ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అన్ని ప్రార్థనా మందిరాల నిర్వాహకులు, అర్బన్ ఎస్ఐలు చిరంజీవి, సుబ్బారావు పాల్గొన్నారు.

సైనికుడిని సన్మానించిన గ్రామస్తులు



సైనికుడు మహ్మద్ రఫీ, కుటుంబ సభ్యులను అభినందిస్తున్న శివప్రసాద్

దువ్వూరు : భారత్ పాకిస్తాన్‌పై చేసిన ఆపరేషన్ సింధూర్ యుద్ధంలో పాల్గొని స్వగ్రామం దువ్వూరుకు మహ్మద్ రఫీ మంగళవారం వచ్చారు. స్వగ్రామానికి వచ్చిన సైనికుడి ఇంటికి వెళ్లి ముస్లిం మత పెద్దలు, నాయకులు, న్యాయవాదులు పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు సింధూర్ యుద్ధం ద్వారా భారత్ పాకిస్తాన్‌కు గట్టి బుద్ధి చెప్పిందన్నారు. ఆ యుద్ధంలో దువ్వూరుకు చెందిన మహ్మద్ రఫీ సైనికుడిగా సేవలు అందించడం గర్వంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో గ్రామానికి, దేశానికి మంచి పేరు తేవాలని సైనికుడి తండ్రి, న్యాయవాది ఇమాంబాషాను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మత పెద్దలు చిరాకి మహబూబ్ బాషా, హుసేన్ బాషా, ముక్తార్ అహ్మద్, అమీర్ బాషా, మాజీ సైనికులు అంద్రోతు రామచంద్రుడు, మైదుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమేశుల శివప్రసాద్, న్యాయవాదులు లక్ష్మి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జీవ రసాయనిక ఎరువులతో భూమి పదిలం



వరికుంట్లలోని రైతు సేవా కేంద్రం వద్ద శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

మైదుకూరు : జీవ రసాయనిక ఎరువులను వినియోగించడం వల్ల భూమి పదిలంగా ఉంటుందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను మంగళవారం జిల్లాలోని అవధూత కాశినాయన మండలంలో నిర్వహించారు. వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షతన మండలంలోని గొంటువారిపల్లె, వరికుంట్ల, సావిశెట్టిపల్లె గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ జీవ రసాయనిక ఎరువులను వినియోగించడం వల్ల పంట నాణ్యమైన దిగుబడి వస్తుందని అన్నారు. పంట సాగులో చేపట్టే యాజమాన్య పద్ధతులను, కొత్త వంగడాల గురించి వివరించారు. అరటిలో సిగటొక తెగులు నివారణలో అవలంభించాల్సిన యాజమాన్య పద్ధతులను, పసుపులో దుంప కుళ్లు నివారణ, విత్తణ శుద్ధి ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పంటల సాగుపై వనిపెంట కేవీకే ప్రచురించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బారాయుడు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్, ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భాగవతప్రియ, పోరుమామిళ్ల ఏడీఏ మురళీనాథరెడ్డి, ఉద్యాన అధికారి శ్రీనివాసరెడ్డి, ఏఓ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా ఫలితాలలో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ



సి.వెంకట ధరణి



ఇ.శ్రావణ్‌కుమార్‌రెడ్డి



కె.వర్షిత



జి.మెర్సి



డి.మునిమోహన రూప



ఎస్.అన్సుబౌరత్

చాపాడు : స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇటీవల విడుదల చేసిన డిప్లొమా మూడో సంవత్సరం ఐదవ సెమిష్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డా.ఎస్.శృతి తెలిపారు. డిప్లొమా ఫలితాలలో ఈసీఈ విభాగంలో సి.వెంకట ధరణి 96.10, ఇ.శ్రావణ్ కుమార్‌రెడ్డి 96, కె.వర్షిత 95.50, ఈఈఈ విభాగంలో జి.మెర్సి 94, డి.మునిమోహన రూప 92.42, ఎస్.అన్సుబౌరత్ 89.90 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. తమ కాలేజీ విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల సీబీఐటీ చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి, డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

తూకాలు తక్కువ ఉండకూడదు

జమ్మలమడుగు : రేషన్‌డీలర్ లబ్ధిదారులకు ఇచ్చే బియ్యంలో ఎటువంటి అవకతవకలు ఉండకూడదని ఆర్డీఓ సాయిశ్రీ తెలిపారు. మంగళవారం పట్టణంలోని 9,10వ వార్డుల్లో ఉన్న రేషన్ దుకాణాలను ఆకస్మిత తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి బియ్యం, చక్కెర, జొన్నలు ఇవ్వడం జరుగుతుంది. రేషన్ డీలర్లు కొలతల్లో ఎమైన అవకతవకలకు పాల్పడితే తమకు ఫిర్యాదు చేయవచ్చు అని సూచించారు. అంతేకాకుండా వృద్ధులకు, వికలాంగులకు డీలర్లు ఇంటి వద్దకే తీసుకువెళ్లి రేషన్‌ను ఇవ్వాలని సూచించారు. ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులు తమకు వస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఒకటో తేదీ నుంచి 15 రోజుల పాటు రేషన్ పంపిణీ జరగాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపు



బద్వేలు అర్బన్: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : సీఎం చంద్రబాబు మోసాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం బద్వేలు నియోజకవర్గంలో చేపట్టనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న ఎన్నికల సమంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకే ప్రాధాన్యమిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలపై ప్రశ్నించకుండా అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తున్నారని, అక్రమ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటుందని ప్రకటించారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక సిద్దవటంలోని ఎన్జీవో కాలనీ వద్ద గల వైఎస్ విగ్రహం నుంచి నాలుగురోడ్ల కూడలి మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి.. అనంతరం అధికారులకు వినతి పత్రం ఇస్తామని తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు మోసాన్ని ఎండగడతాం



రఘురామిరెడ్డి

మైదుకూరు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు చేసిన మోసాన్ని ఎండట్టేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. మైదుకూరు పట్టణంలోని వనిపెంట రోడ్డులో ఉన్న శ్రీ అంకాలమ్మ ఆలయం వద్ద నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు భారీ ర్యాలీ ప్రారంభమవుతుందని ఈ సందర్భంగా రఘురామిరెడ్డి పేర్కొన్నారు. రాయల కూడలి మీదుగా ర్యాలీ కొనసాగుతుందని, అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడంపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని అందేస్తామని వివరించారు. కార్యక్రమంలో చంద్రబాబు పాలనలో మోసానికి గురైన మహిళలు, రైతులు, నిరుద్యోగులు, యువతులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సూపర్ సిక్స్ పథకాలు ఏవీ?



వైఎస్సార్‌సీపీ దువ్వూరు మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి

దువ్వూరు : మైదుకూరు పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ దువ్వూరు మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతోపాటు 137 హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారం చేపట్టి ఏడాది అయినా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదన్నారు. ప్రజలకు, రైతులకు, మహిళలకు, నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగడుతూ వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మైదుకూరులో బుధవారం ఉదయం 9 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నిరసన ర్యాలీలో పాల్గొనాలని కోరారు.


ప్రజలను నిలువునా మోసం చేశారు

గోపవరం : వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నిర్వహించే వెన్నుపోటు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ చల్లా రవిచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కారణంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు.. బుధవారం బద్వేలు ఎన్జీవో కాలనీ వద్ద ఉన్న దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పోరుమామిళ్ల : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బద్వేలులో తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం బద్వేలులో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ర్యాలీలో నియోజక వర్గంలో ఉన్న ప్రతి అభిమాని, నాయకుడు, కార్యకర్త పాల్గొనాలని కోరారు.

కాశినాయన : వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9 గంటలకు బద్వేలుకు చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హామీల అమలు కోరుతూ నేడు భారీ ర్యాలీ



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక పుట్టపర్తి సర్కిల్ నుండి శ్రీరాములపేట మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఏ హామీ నెరవేర్చలేదని తెలిపారు. చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేసినందుకు నిరసన తెలుపుతూ ప్రజల పక్షాన ప్రశ్నించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు రైతు భరోసా ఇవ్వలేదని, అమ్మ ఒడి ఊసే లేదన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ఎంత మందికి వర్తించిందో చెప్పాలని తెలిపారు. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు అని ఎన్నికల సందర్భంగా ఇంటింటా ప్రచారం చేసిన టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చాక కనిపించడంలేదన్నారు. ర్యాలీ అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తామని తెలిపారు. మహిళలు, ప్రజలు, నిరుద్యోగులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.